



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : శనివారం 6:24(సాయంత్రం)
సెహరీ : ఆదివారం 4:47 (ఉదయం)



రాజకీయం.. రసవత్తరం..!



- నందికొట్కూరులో వైసీపీని వీడుతున్న కేడర్
- ఆర్థర్‌కు మొండిచేయి చూపడమే కారణం
- నాన్‌లోకల్‌కు టికెట్ ఇవ్వడంతో అసంతృప్తి
- బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వర్గంలోనూ ఇదే పరిస్థితి
- వైసీపీలోని పరిణామాలతో టీడీపీలోకి వలసలు
- బైరెడ్డి చేరికతో పార్టీకి మరింత బలం

నంద్యాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి)/ నందికొట్కూరు: నందికొట్కూరులో రాజకీయం రసవత్తరంగా మారింది. వైసీపీకి షాక్‌ల మీద షాక్‌లు తగులుతుండగా టీడీపీకి క్రమంగా ఆదరణ పెరుగుతోంది. ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్‌ను కాదని స్థానికేతరుడైన దారా సుధీర్‌కు టికెట్ కేటాయించడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. మరోవైపు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి టీడీపీలో చేరడం వల్ల కూడా పార్టీ బలోపేతం అవుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. కాంగ్రెస్ తరపున ఆర్థర్ బరిలో నిలిస్తే ఓట్లు చీలిపోతాయన్న ఆందోళన వైసీపీ నాయకులకు పట్టుకుంది. నిన్నటి వరకు గెలుపు టీడీపీదా.. వైసీపీదా.. అన్నట్లుగా చర్చ సాగగా.. ఇప్పుడేమో టీడీపీదేనన్న ప్రచారం జరుగుతోంది.

గట్టి పట్టుదలతో టీడీపీ..


గిత్తా జయసూర్య

నందికొట్కూరు జనరల్ సీటుగా ఉన్నప్పుడు.. దాదాపుగా 20 ఏళ్ల కిందట ఇక్కడ టీడీపీ జెండా ఎగిరింది. ఆ తర్వాత గౌరు చరిత కాంగ్రెస్ తరపున గెలిచారు. ప్రస్తుతం గౌరు కుటుంబం టీడీపీలో ఉంది. ఇక వారికి సమీప బంధువైన నంద్యాల పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు మాండ్ర శివానందరెడ్డి కూడా టీడీపీలోనే ఉన్నారు. మాండ్ర టీడీపీ అధినేత చంద్రబాబును పట్టుబట్టి మరీ తన వర్గానికి చెందిన గిత్తా జయసూర్యకు టికెట్ ఇప్పించుకున్నారు. దీంతో గౌరు కుటుంబం, మాండ్ర కుటుంబం కలిసి జయసూర్యను ఎలాగైనా గెలిపించుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో వైసీపీ వర్గాన్ని మాండ్ర శివానందరెడ్డి తమ వైపునకు తిప్పుకుంటున్నారు. అయితే తమ వర్గాన్ని కాపాడుకునేందుకు వైసీపీ నాయకులు నానా తంటాలు పడుతున్నట్టు సమాచారం. అయితే ఎన్నికల షెడ్యూల్ వచ్చే వరకు ఆగిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఇప్పుడు ఎవరు చెప్పినా వినకుండా పార్టీ మారుతున్నారు. దీంతో వైసీపీ దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటోంది. పైగా దారా సుధీర్ నియోజకవర్గానికి కొత్త కావడంతో ఇక్కడ రాజకీయం ఎలా చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారన్న ప్రచారం కూడా జరుగుతోంది.

వైసీపీకి ఆర్థర్ ఎఫెక్ట్..

గత ఎన్నికల్లో నందికొట్కూరు నియోజకవర్గం నుంచి ఎప్పుడూ లేని విధంగా తోగూరు ఆర్థర్ 40 వేల భారీ మెజారిటీతో గెలిచారు. వచ్చే ఎన్నికల్లోనూ వైసీపీ తరపున ఆయనే గెలుస్తారని వైసీపీ సొంత సర్వేలు కూడా తేల్చాయి. వీటన్నింటిని పక్కన పెట్టి ఎక్కడో కడప జిల్లాకు చెందిన దారా సుధీర్‌కు ఇక్కడ సీటును కేటాయించింది. పైగా ఆర్థర్‌కు మరో ప్రత్యామ్నాయం కూడా చూపించలేదని పార్టీలోని అంతర్గత సమాచారం. దీంతో ఆర్థర్ మొదట టీడీపీ వైపు చూశారు. అయితే మాండ్ర వర్గానికి టీడీపీ టికెట్ కేటాయించడంతో ఆర్థర్‌కు స్థానం లేకుండా పోయింది. ఏ పార్టీకి వెళ్లాలి అనే తర్జనభర్జనల అనంతరం కాంగ్రెస్‌లో చేరిపోయారు. ఆర్థర్ ఇలా చేయడంతో నందికొట్కూరు వైసీపీకి గట్టి షాక్ తగిలినట్లయింది. సుధీర్‌కు వైసీపీ టికెట్ కేటాయించడంతో నందికొట్కూరులో లోకల్, నాన్‌లోకల్ భావన కూడా బలంగా ఏర్పడింది. పైగా ఆర్థర్ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు నియోజకవర్గంలో దాదాపు 32 వేలకు పైగా ఉన్నట్లు తెలుస్తోంది. మొన్నటి వరకు వైసీపీకి అనుకూలంగా ఉన్న వీరంతా ఆర్థర్‌కు టికెట్ లేదనగానే, టీడీపీ వైపు మొగ్గు చూపడం మొదలుపెట్టారు. ఇక ఉన్న కాస్త వర్గం కూడా చీలే అవకాశం ఉండటంతో ఆ వర్గం ఓట్లను వైసీపీ భారీగా కోల్పోయే అవకాశం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇలా జరిగితే టీడీపీ అభ్యర్థి విజయం సులభమేనన్న ప్రచారం వినిపిస్తోంది.


ఆర్థర్

జోష్‌లో టీడీపీ..

నందికొట్కూరు టికెట్‌ను కేటాయించేందుకు టీడీపీ అధిష్ఠానం గట్టి కసరత్తు చేసింది. వైసీపీ తమ అభ్యర్థిని ప్రకటించే వరకు వేచి చూసింది. నియోజకవర్గంలో నాన్ లోకల్ భావనను ఒడిసి పట్టుకునేందుకు ఎప్పటి నుంచో పార్టీని అంటిపెట్టుకుని ఉన్న గిత్తా జయసూర్యను ఎంపిక చేయాలంటూ మాండ్ర టీడీపీ అధిష్ఠానానికి సూచించారు. ఇందుకు టీడీపీ అధిష్ఠానం కూడా అంగీకరించడంతో జయసూర్యకు టికెట్ ఖాయమైంది. ఇక జయసూర్యకు నియోజకవర్గంలోని మిడ్తూరు, పగిడ్యాల, నందికొట్కూరు, జూపాడుబంగ్లా మండలాల్లో బంధువులతోపాటు మిత్రులు, శ్రేయోభిలాషులు అధికంగా ఉన్నారు. అందరితో కలిసిపోయే మనస్తత్వం ఉన్న గిత్తా జయసూర్య నియోజకవర్గ ప్రజల్లోకి దూసుకుపోతున్నారు. స్థానికుడైన జయసూర్యను గెలిపించుకోవాలన్న దృక్పథంతో దళితులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఏకమవుతున్నట్లు తెలుస్తోంది.



వైసీపీలో అంతర్మథనం..

నియోజకవర్గంలో మొదటి నుంచి ఎమ్మెల్యే ఆర్థర్ వర్గానికి, శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వర్గానికి మధ్య ఎపుడూ ఏదో రభస జరుగుతూనే ఉంది. దీంతో ఈ సారి ఆర్థర్‌కు వైసీపీ టికెట్ కేటాయించదన్న అభిప్రాయం చాలా కాలంగా వినిపిస్తూ వచ్చింది. ఆయన స్థానంలో సిద్ధార్థ వర్గానికి చెందిన ఎక్కలదేవి చంద్రమౌళికి గానీ, లబ్బి వెంకటస్వామికి గానీ టికెట్ వస్తుందని అందరూ భావించారు. అయితే అనూహ్యంగా వైసీపీ అధినేత జగన్ తన సొంత జిల్లా కడపకు చెందిన సుధీర్‌ను ఇక్కడ బరిలో దింపడంతో సిద్ధార్థ వర్గానికి మింగుడుపడలేదు. స్థానికుడికి కాకుండా.. ఎక్కడి వ్యక్తినో తెచ్చి పెడితే.. ప్రజల్లోకి ఎలా వెళ్లాలన్న మీమాంసలో నియోజకవర్గ వైసీపీ కేడర్ పడిపోయింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మొండి పోకడలతో తమకు ప్రజల్లో ముఖం చెల్లే పరిస్థితి లేదని గ్రహించిన వారంతా అంతర్మథనంలో పడిపోయారు. పార్టీని వీడటమే మంచిదని భావించి టీడీపీలో చేరడం చూడటం మొదలుపెట్టారు. ఇలా పార్టీని వీడిన వారిలో సిద్ధార్థ వర్గానికి చెందిన ఎక్కలదేవి చంద్రమౌళి, లబ్బి వెంకటస్వామి కూడా ఉన్నారన్న ప్రచారం నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది. దీనికి తోడు దారా సుధీర్ వచ్చినప్పటి నుంచి కుల, మత సంఘాల నాయకులతో సమావేశాలు నిర్వహించగా వాటి నుంచి స్పందన అంతంత మాత్రంగానే ఉండటంతో నియోజకవర్గంలో వైసీపీ పని అయిపోయిందన్న అభిప్రాయం ఆ పార్టీ నేతల నుంచే వినిపిస్తోంది.



శబరి చేరికతో..


బైరెడ్డి శబరి

బైరెడ్డి శబరి టీడీపీలో చేరడం ఆ పార్టీ నందికొట్కూరు నియోజకవర్గానికి కలిసి వచ్చే అంశం. మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కూతురైన బైరెడ్డి శబరికి నంద్యాల ఎంపీ టిక్కెట్ ఖరారు అయిపోయింది. వైసీపీకి అత్యంత పట్టున్న పగిడ్యాల మండలంతోపాటు నియోజవర్గంలోని అన్ని మండలాల్లో బైరెడ్డి శబరి రాకతో టీడీపీ బలం పెరిగింది. బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తన పాత వర్గాన్ని కలుస్తూ టీడీపీని బలోపేతం చేసేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. దీంతో నందికొట్కూరు టీడీపీ కార్యకర్తలు, నాయకుల్లో రెట్టింపు ఉత్సాహం కనిపిస్తోంది. బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పాత వర్గం, శివానందరెడ్డి వర్గం ఇరువర్గాలు కలిసి పని చేస్తే ఇక్కడ టీడీపీ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరనే చర్చ సాగుతోంది.

టీడీపీ ఎంపీ అభ్యర్థిగా శబరి



బైరెడ్డి వర్గీయుల్లో కొత్త ఉత్సాహం

నంద్యాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థిగా బైరెడ్డి శబరిని అధిష్ఠానం శుక్రవారం ఓ ప్రకటించింది. దీంతో బైరెడ్డి రాజశేఖరరెడ్డి వర్గీయుల్లో కొత్త ఉత్సాహం కనిపించింది. శబరి తండ్రి బైరెడ్డి రాజశేఖరరెడ్డి గతంలో టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా పని చేశారు. ఆయనకు నందికొట్కూరు, పాణ్యం నియోజకవర్గాలో పట్టు ఉంది. బైరెడ్డి రాజశేఖరరెడ్డి టీడీపీ తరఫున నందికొట్కూరు ఎమ్మెల్యేగా 1994, 1999 రెండు పర్యాయాలు పని చేశారు. అనంతర పరిణామాల్లో టీడీపీని వీడి రాయలసీమ పరిరక్షణ సమితిని స్థాపించి ఈ ప్రాంతానికి నీళ్లు, నిధులు, నియమకాల కోసం ఉద్యమాలు నడిపారు. ఆయన తండ్రి బైరెడ్డి శేషశయనా రెడ్డి కాంగ్రెస్ పార్టీ తరఫున 1978, 1983, 1989లో వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన మంత్రిగా కూడా పని చేశారు. ఇక బైరెడ్డి తల్లి భారతి కూడా రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన వారే. భారతి తాత బీవీ సుబ్బారెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1962 నుంచి 1970 వరకు అసెంబ్లీ స్పీకర్‌గా, ఉప ముఖ్యమంత్రిగా పని చేశారు. భారతి తండ్రి టీ నరసింహారెడ్డి 1983లో బనగానపల్లె ఎమ్మెల్యేగా గెలిచారు.

వైద్య వృత్తి నుంచి రాజకీయాల్లోకి..

బైరెడ్డి శబరి వృత్తిరీత్యా వైద్యురాలు. ఆమె ఎంబీబీఎస్, ఎండీ చదివి కొద్ది రోజులు వైద్య సేవలు అందించారు. ఆమె నెల్లూరుకు చెందిన శివచరణ్‌రెడ్డిని వివాహం చేసుకున్నారు. వృత్తిరీత్యా ఆయన కూడా వైద్యుడే. ప్రస్తుతం హైదరాబాద్‌లో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టుగా పని చేస్తున్నారు. వీరికి ఒక కుమార్తె. శబరి మొదట 2019లో బీజేపీలో సామాన్య కార్యకర్తగా చేరి అనతి కాలంలోనే ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలి స్థాయికి ఎదిగారు. ఇక ఇటీవలే బీజేపీకి రాజీనామా చేసి టీడీపీ తీర్థం పుచ్చుకుని టీడీపీ తరఫున ఎంపీ టికెట్‌ను దక్కించుకున్నారు.



కన్నులపండువగా కల్యాణోత్సవం


ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహ స్వామి, చెంచులక్ష్మి అమ్మవార్ల కల్యాణం చేస్తున్న వేదపండితులు

నంద్యాల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎగువ అహోబిలంలో ఎనిమిదో రోజు శుక్రవారం జ్వాలా నరసింహస్వామి, చెంచులక్ష్మి అమ్మవార్ల కల్యాణాన్ని వేదపండితులు కన్నులపండువగా నిర్వహించారు. ముందుగా ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహ స్వామికి తిరుమంజనం, గజ వాహనం కార్యాక్రమాలను నిర్వహించారు. అనంతరం వేద పండితులు స్వామి, అమ్మవార్లను విశేషంగా పూలమాలలతో అలంకరించి పల్లకిలో కల్యాణ మండపానికి చేర్చారు. అక్కడ అశేష భక్త జనాల మధ్య స్వామి, అమ్మవార్లకు సాంప్రదాయ బద్ధంగా ఎదురోళ్లు నిర్వహించి వేదమంత్రోచ్చారణల మధ్య కనుల పండువగా కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవంలో పద్మశాలి సంఘంకర్నూలుకు చెందిన మేర్వ లక్ష్మయ్య, ఉషారాణి దంపతులు ఉభయదారులుగా కూర్చున్నారు.

దిగువ అహోబిలంలో..

అహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం వేణుగోపాల స్వామి అలంకారంలో ప్రహ్లాద వరదస్వామి భక్తులకు దర్శనం కల్పించారు. ఆ తరువాత చూర్ణాభిషేకం, అభిషేకం నిర్వహించారు. రాత్రి పొన్న చెట్టు వాహనంపై విహరించారు.


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

నేడు ఎగువ అహోబిలంలో

ఎగువ అహోబిలంలో శనివారం ఉత్సవం, తొట్టి తిరుమంజనం, అశ్వ వాహనం కార్యక్రమాలను వేదపండితులు నిర్వహిస్తారు. దిగువ అహోబిలంలో ఉత్సవం, గజవాహనం, తిరుకళ్యాణోత్సవం కార్యక్రమాలు ఉంటాయి.

2,688 మంది విద్యార్థులు గైర్హాజరు

కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలు

నంద్యాల (నూనెపల్లె), మార్చి 22: పదో తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన గణితం పరీక్షకు జిల్లాలో 2,688 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 134 పరీక్షా కేంద్రాల్లో 28,599 మంది విద్యార్థులకుగాను 25,911 మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారన్నారు. 90.06 శాతం హాజరు నమోదైనట్లు డీఈఓ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 10 ఫ్లాయింగ్ స్క్వాడ్ బృందాలు 49 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా రాష్ట్ర పరిశీలకులు ఆర్ఎస్ గంగా భవాని పది పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారని చెప్పారు. సమస్యాత్మక కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి పరీక్షలు సజావుగా నిర్వహించినట్లు తెలిపారు.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు: ఎస్పీ



నంద్యాల క్రైం, మార్చి 22 : ఎన్నికల కోడ్‌ను ఎవరు ఉల్లంఘించినా చట్టపరంగా శిక్షార్హులేనని నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సభలు, సమావేశాలు నిర్వహించుకోవాలంటే పార్టీ లేదా అభ్యర్థి స్థానిక పోలీసు అధికారులకు సభ నిర్వహించే ప్రదేశం, సమయం ముందుగానే తెలియజేయాలన్నారు. ర్యాలీలు చేసేవారు పూర్తి వివరాలను ముందుగా అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఓట్ల కోసం ప్రజల మధ్య విభేదాలను మరింత పెంచేలా, పరస్పర విద్వేషాన్ని రగిల్చేలా కులాలు, జాతుల మధ్య మతపరమైన, భాషాపరమైన, స్థానికత ఆధారంగా ఉద్రేకాలను కలిగించే ఎలాంటి చర్యలకు పాల్పడకూడదన్నారు. ఎన్నికల ప్రచారానికి మసీదులు, చర్చిలు, దేవాలయాలు, విద్యాలయాలను వేదిక చేసుకోకూడదన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వ్యక్తులపై ఐపీసీ చట్టం ప్రకారం, రెప్రజెంటేషన్ ఆఫ్ ద పీపుల్ యాక్ట్-1951 ప్రకారం, ప్రివెన్షన్ ఆఫ్ డిఫేస్‌మెంట్ ఆఫ్ ప్రాపర్టీ యాక్ట్-1985 చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

THE JUBILEE HILLS CO-OPERATIVE HOUSE BUILDING SOCIETY LTD.
(T.A. No. 173)
Jubilee Hills, Hyderabad - 500 171. Phone: 23540641, 23540642

GENERAL BODY MEETING
ON
SUNDAY, 24th March, 2024
At 11.00 A.M.

NOTICE

Notice is hereby given that a General Body Meeting of the Society will be held on **Sunday, 24th March, 2024 at 11.00 a.m.** at Jubilee Hills Co-operative House Building Society Community Hall/ Community Centre, Road No. 51, Jubilee Hills, Hyderabad - 500033, to transact the following business.

Agenda:
1. Confirmation of minutes of previous General Body Meeting held on 24.09.2023.
2. Report for the period from 01.08.2023 to 29.02.2024.
3. Action taken report on the minutes of the General Body Meeting held on 24.09.2023.
4. Statement of Receipts and Expenditure for the Year 2023-2024 and approval of budget estimates for the year 2024-2025.
5. Disqualification of non-traceable society members/members without plots on the following subjects:
   (I) Who fails to transact such minimum business or utilize minimum services or facilities in a year as may be specified in the bye-laws, TCS Act and rules
   (ii) Who fails to give information relevant to him/her to the society as specified in the bye-laws, TCS Act and Rules
6. Appointment of Internal Auditors
7. Finalization of site for Jubilee Hills Phase - IV for waitlisted members/members without plot.
8. Any other item with the permission of the Chair.


Dated: 15.02.2024

Sd-
(B. RAVINDRANATH)
President

Important Note:
1. Please carry a valid ID proof to attend the meeting.
2. Request all the members to inform society office in writing any changes in address.

వైఛీప్ ప్లాన్

- వలంటీర్ల కుటుంబ సభ్యులతో ప్రలోభాలకు పన్నాగం..?
- రెండు నెలల క్రితమే వారి వివరాల సేకరణ
- ఓటర్లను మభ్యపెట్టేందుకు కుట్రలు



ఆత్మకూరు, మార్చి 22: ఎన్నికలు సమీపిస్తుండటంతో వలంటీర్ వ్యవస్థ ద్వారా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వైసీపీ కొత్త ఎత్తులు వేస్తోంది. వైసీపీ అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలంటూ వలంటీర్లకు డబ్బు పంపిణీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ హెచ్చరికలు జారీ చేయడంతో తాజాగా ఆ పార్టీ మరో వ్యూహానికి తెరలేపినట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకోసం వలంటీర్లకు బదులు వారి కుటుంబ సభ్యులను రంగంలోకి దింపినట్లు సమాచారం. శ్రీశైల నియోజకవర్గంలో వైసీపీ నాయకులు వలంటీర్ వ్యవస్థను పరోక్షంగా వినియోగించుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిసింది. వలంటీర్లు నేరుగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటే సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని ఎన్నికల కమిషన్ పేర్కొంది. దీంతో అనేక చోట్ల వలంటీర్లు వైసీపీ నాయకులతో కలిసి ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారిని తొలగించారు. అదేవిధంగా శ్రీశైల నియోజకవర్గంలో కూడా వలంటీర్లు ఓటర్లను ప్రభావితం చేస్తే వదిలిపెట్టవద్దని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఇటీవల టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఓ వైపు ఎన్నికల అధికారులు, మరో వైపు ప్రతిపక్ష పార్టీల నాయకులు వలంటీర్లపై నిఘా ఉంచడంతో ప్రచారంలో పాల్గొనలేని పరిస్థితి నెలకొంది. దీంతో వలంటీర్ల కుటుంబ సభ్యుల ద్వారా ఓటర్లను ప్రభావితం చేసేందుకు వైసీపీ పన్నాగం పడినట్లు సమాచారం.

వలంటీర్ వ్యవస్థతో..

వలంటీర్‌లు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనరాదని, వారు వినియోగిస్తున్న ప్రభుత్వ సెల్‌ఫోన్ల సిమ్‌లు అందజేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. వలంటీర్‌లను ఎన్నికల కమిషన్ ఎక్కడికక్కడ కట్టడి చేయడంతో వైసీపీ నాయకులకు దిక్కుతోచక మరో వ్యూహానికి తెరలేపారు. ఈ పరిణామాన్ని వైసీపీ నాయకులు ముందే ఊహించారో ఏమో తెలియదు గాని రెండు నెలల క్రితమే ప్రతి వలంటీర్ తరఫున వారి కుటుంబ సభ్యుల నుంచి ఒకరిని ఎంపిక చేసుకొని ఓటర్లను ప్రలోభాలకు గురిచేయాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. మహిళా వలంటీర్ అయితే ఆమె భర్త, పురుషుడైతే వారి సోదరులు, ఇతర బంధువర్గం నుంచి ప్రత్యామ్నాయంగా ఓ వ్యక్తిని ఎంపిక చేసినట్లు సమాచారం. ఇప్పటికే సదరు వలంటీర్ ద్వారా వారి పరిధిలోని కుటుంబాలకు జరిగిన లబ్ధి సమాచారాన్ని కూడా సేకరించి ప్రలోభాలకు గురిచేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. అదేవిధంగా ఓటర్ల వద్దకు వలంటరీలు నేరుగా వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో ఫోన్ల ద్వారా వీలైనంత వరకు వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేయించేందుకు ఆ పార్టీ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. మొత్తానికి ఎన్నికల్లో వలంటీర్ వ్యవస్థ ప్రమేయం లేకుండా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకుంటుంటే వైసీపీ మాత్రం వలంటీర్ వ్యవస్థను ఎలాగైనా తమకు అనుకూలంగా వాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం.

పది పరీక్షలకు 903 మంది గైర్హాజర్

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 22: కర్నూలు జిల్లాలో శుక్రవారం జరిగిన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ తెలిపారు. మొత్తం విద్యార్థులు 35,210 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 34,307 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 903 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. జిల్లా పరిశీలకుల అధికారి (డీఎల్‌వో) 5 పరీక్ష కేంద్రాలను, జిల్లా విద్యాశాఖ అధికారి 3 పరీక్ష కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 7, సిట్టింగ్ స్క్వాడ్‌లు 44 పరీక్ష కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. ఎటువంటి మాల్ ప్రాక్టీసు కేసు నమోదు కాలేదని డీఈవో తెలిపారు.

రేపు హజ్ యాత్రికులకు శిక్షణ

కర్నూలు(న్యూసిటీ), మార్చి 22: కర్నూలు జిల్లా జమియత్ ఉలమా, అల్ మదీనా సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో హజ్‌కు వెళ్లే యాత్రికులకు ఆదివారం శిక్షణ ఇవ్వనున్నట్లు జమియత్ ఉలమా జిల్లా అధ్యక్షుడు మౌలానా ఖాజీ అబ్దుల్ మజీద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు,నంద్యాల జిల్లాలకు సంబంధించి నగరంలోని అబ్బాస్‌నగర్ యూనిక్ పాఠశాలలో జరిగే శిక్షణలో పాల్గొనే యాత్రికులకు భోజన వసతి కల్పించామన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ హజ్‌కమిటి, ప్రైవేట్ టూర్స్ ద్వారా వెళ్లే హజ్ యాత్రికులు ఈ అవకాశాన్ని చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు 90328 75378 నంబరును సంప్రదించాలని తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించండి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 22: భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం దాదాపు 33 నిత్యావసర సేవలు అందించే శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించినట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. శుక్రవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఆయా శాఖల ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం రాజకీయ పార్టీలు నిర్వహించే ఎలాంటి కార్యక్రమాలకైనా ముందుగా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాల పరిధిలో ఉన్న ఎలక్ట్రానిక్ సీజర్స్ మేనేజ్‌మెంట్ సిస్టం వినియోగాన్ని పటిష్టపరచాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డా.జి. సృజన, డీఆర్వో మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌ను పూర్తి చేయాలి

ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి



డీఎంహెచ్‌వోను కలిసిన ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వెంగళ్‌రెడ్డి

కర్నూలు(హస్పిటల్), మార్చి 22: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులను కూడా వైద్య ఆరోగ్యశాఖ తరహాలోనే రెగ్యులరైజేషన్ చేయాలని ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి డీఎంహెచ్‌వో డా.వై. ప్రవీణ్ కుమార్‌ను కోరారు. ఈ మేరకు డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన ఆయనను ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు కలిసి అభినందనలు తెలిపారు. యాప్‌లను, లక్ష్యాలను వైద్య ఉద్యోగులు నెరవేర్చాలని, ఉద్యోగులకు సంబంధించిన ఆర్థికపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీఎంహెచ్‌వోను కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవో కె.అరుణ, ఆఫీస్ సూపరింటెండెంట్ పత్తికొండ శ్రీనివాసులు, ఏపీఎన్జీవో కర్నూలు సిటీ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్, కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఉగాది పురస్కారాలు



కర్నూలు, మార్చి 22: ఉమ్మడి కర్నూలు జిల్లా పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారాలను ప్రకటించింది. పోలీసు శాఖ, అగ్నిమాపక శాఖ, విజిలెన్స్ విభాగాల్లో 2024 సంవత్సరానికి ఈ అవార్డులు ప్రకటించింది.

ఉత్తమ సేవా పథకం:

- విజయశేఖర్ (డీఎస్పీ, కర్నూలు)
- చెంచయ్య (ఆర్ఎస్ఐ, ఏపీఎస్పీ సెకండ్ బెటాలియన్ కర్నూలు)
- భీముడు నాయక్ (స్టేషన్ ఫైర్ ఆఫీసర్, ఆత్మకూరు ఫైర్ స్టేషన్)

కఠిన సేవా పథకం :

- ప్రసాద్ (పీసీ ఏపీఎస్పీ సెకండ్ బెటాలియన్)
- రాము (పీసీ ఏపీఎస్పీ సెకండ్ బెటాలియన్)

సేవా పథకం :

- శ్రీనివాసులు (ఎస్ఐ, కోడుమూరు)
- సాయిరామ్ (ఆర్ఐ, ఏపీఎస్పీ సెకండ్ బెటాలియన్)
- గౌస్ మొహిద్దీన్ (ఎస్ఐ, సీసీఎస్, నంద్యాల)
- ఓబులేసు (ఆర్ఎస్ఐ, కర్నూలు ట్రాఫిక్)
- శ్రీనివాసులు (హెచ్‌సీ, కర్నూలు త్రీటౌన్)
- రామాంజనేయులు (హెచ్‌సీ, గూడూరు పీఎస్)
- రామయ్య (హెచ్‌సీ, ఎస్పీ పోలీస్‌స్టేషన్)
- దామోదరం (ఏఆర్ హెచ్‌సీ, నంద్యాల)
- వెంకట సుబ్బయ్య (ఏఎస్ఐ, నంద్యాల టూటౌన్)
- మాసన్న (ఏఎస్ఐ, ఆత్మకూరు)
- కేవీ ప్రసాద్ (ఏఆర్ఎస్ఐ, ఏపీఎస్పీ సెకండ్ బెటాలియన్)
- సుందర్‌రాజు (ఏఆర్ఎస్ఐ, ఏపీఎస్పీ సెకండ్ బెటాలియన్)
- వేణుగోపాల్ (పీసీ, విజిలెన్స్)
- భరత్ కుమార్ (పీసీ, విజిలెన్స్)

వీడని ఉత్కంఠ!

- మూడో జాబితాలో కూడా లేని ఆదోని, ఆలూరు అభ్యర్థుల పేర్లు
- ఆశావహుల్లో టెన్షన్.. టెన్షన్

కర్నూలు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు శుక్రవారం రాష్ట్రంలో 13 మంది ఎంపీ అభ్యర్థులు, 11 మంది ఎమ్మెల్యే అభ్యర్థులతో మూడో జాబితా ప్రకటించారు. ఈ జాబితాలో ఆదోని, ఆలూరు అభ్యర్థులను ప్రకటిస్తారని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నాయకులు ఆశించారు. అయితే.. వివిధ కారణాల వల్ల మూడో జాబితాలో స్థానం దక్కలేదు. దీంతో ఆశావహులు, టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా పొత్తులో భాగంగా ఆదోని స్థానం బీజేపీ తీసుకుంది. స్థానిక రాజకీయ, సామాజిక పరిమాణాలు దృష్ట్యా ఆ స్థానం టీడీపీకే ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు బీజేపీ నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఓ క్లారిటీ రాకపోవడంతో ఆదోని, ఆలూరు స్థానాలు పెండింగులో ఉంచారని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. అయితే.. బీజేపీ దిగి వస్తుందా..? ఎన్డీఏ కూటమి నాయకుల మదిలో తొలుస్తున్న ప్రశ్న ఇది. ఆ రెండు నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులుగా బరిలో దిగేదెవరు..? అంటూ ప్రజలు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. జిల్లాలో కర్నూలు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలు సహా పాణ్యంతో కలిపి ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. తొలి విడతలో కర్నూలు, పాణ్యం, పత్తికొండ, కోడుమూరు (ఎస్సీ) అభ్యర్థులు టీజీ భరత్, గౌరు చరిత, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరిలను అధినేత చంద్రబాబు ప్రకటించారు. ఈ నెల 16న రెండవ జాబితాలో ఎమ్మిగనూరు అభ్యర్థిగా బీవీ జయనాగేశ్వరరెడ్డి, మంత్రాలయం అభ్యర్థిగా మాధవరం ఎస్.రాఘవేంద్రరెడ్డి పేర్లు ప్రకటించారు. పొత్తులో భాగంగా ఆదోని నియోజకవర్గం బీజేపీకి కేటాయించడంతో అక్కడ టికెట్ ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు విజయవాడకు పరుగులు పెట్టారు. అధినేత చంద్రబాబును కలిసి తనకు అవకాశం ఇవ్వాలని కోరారు.

టీడీపీ నేతల్లో టెన్షన్.. టెన్షన్

ఆదోని టికెట్‌ను పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించారు. అయితే.. ఆ నియోజకవర్గంలో వివిధ సామాజిక వర్గాల సహా మైనార్టీల బలాబలాలు, రాజకీయ సామాజికంగా పరిస్థితులు, గతంలో జరిగిన ఇరువర్గాల ఘర్షణలు.. వంటి కారణాల దృష్ట్యా బీజేపీకి కేటాయిస్తే ఆ ప్రభావం జిల్లాలో పలు నియోజకవర్గాలపై ఉంటుందని, ఎన్నికల్లో నష్టపోయే ప్రమాదం లేకపోలేదని పలువురు జిల్లా, రాష్ట్ర నాయకులు టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. అంతర్గత సర్వేల్లో కూడా పలువురు అదే విషయం వెల్లడించినట్లు తెలుస్తుంది. అదే క్రమంలో తనకు అవకాశం ఇస్తే తప్పక విజయం సాధిస్తానని నియోజవకర్గం టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు సైతం చంద్రబాబును కలిసి వాస్తవ పరిస్థితులు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన బీజేపీ అధిష్టానంతో చర్చిస్తానని తెలిపారు. ఇందులో భాగంగా ఆదోని తమకు వదిలేసి మరో నియోజకవర్గంలో పోటీ చేయాలని టీడీపీ అధిష్టానం బీజేపీ పెద్దలతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. చర్చలు ఓ కొలిక్కి రాకపోవడంతోనే ఆదోని, ఆలూరు స్థానాల అభ్యర్థులను మూడో జాబితాలో ప్రకటించలేదని తెలిసింది. సంప్రదింపుల్లో భాగంగా బీజేపీ ఓ మెట్టు దిగివచ్చి ఆదోని వదులుకుంటే ఆలూరు బీజేపీకి ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు. అదే జరిగితే ఆలూరు టికెట్ ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, టీడీపీ మాజీ ఇన్‌చార్జిలు వీరభద్రగౌడ్, వైకుంఠం మల్లికార్జున, వైకుంఠం జ్యోతిలకు నిరాశ తప్పదు. ఒకవేళ అనంతపురం జిల్లా గుంతకల్లు సీటు బీజేపీ తీసుకుంటే ఆలూరు నుంచి మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం బరిలో దిగే అవకాశం లేకపోలేదు. ఆదోని టికెట్ విషయంలో బీజేపీ పట్టువీడకపోతే మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు సహా ఇక్కడ టికెట్ ఆశించిన నాయకులకు నిరాశ తప్పదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లో బీజేపీని చంద్రబాబు ఒప్పిస్తారని, మీనాక్షినాయుడుకే టికెట్ వస్తుందని ఆయన వర్గీయులు పూర్తి విశ్వాసంతో ఉన్నారు. అలాగే.. మంత్రాలయం టికెట్ వాల్మీకి సామాజికవర్గానికి చెందిన రాఘవేంద్రరెడ్డికి ఇవ్వడంపై నియోజకవర్గం ఇన్‌చార్జి తిక్కారెడ్డి, ఆయన వర్గీయులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. వైసీపీ నుంచి వచ్చిన వారికి టికెట్ ఎలా ఇస్తారని, పునరాలోచించి తిక్కారెడ్డికే టికెట్ ఇవ్వాలంటూ ఆయన వర్గీయులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. మూడో జాబితాలో ఎలాంటి మార్పు లేకపోవడంతో తిక్కారెడ్డి వర్గీయులు కూడా నిరాశతో ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగేందుకు తిక్కారెడ్డి సిద్ధం అవుతున్నారు.

తహసీల్దార్, వీఆర్‌వోలపై కేసు నమోదు

పెద్దకడుబూరు, మార్చి22: నకిలీ దస్త్రాలను సృష్టించి స్వామినాథన్ భూమిని సొంతం చేసుకునేందుకు సహకరించిన మండల తహసీల్దార్, వీఆర్‌వో, కంప్యూటర్ ఆపరేటర్‌లపై పెద్దకడుబూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. శుక్రవారం ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. ఆదోని పట్టణంలో నివాసం ఉంటున్న స్వామినాథన్‌కు చిన్నతుంబళం గ్రామంలో 2.52 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని సింగరాజనహళ్ళికి చెందిన లోకేశ్వర్ రెడ్డి, అంగాస్కల్ రూప నకిలీ దస్త్రాలను సృష్టించి తమ పేరుపై నమోదు చేసుకున్నారు. దీనికి అప్పటి తహసీల్దార్ కుమార స్వామి, వీఆర్వో బీటీ సురేష్, కంప్యూటర్ ఆపరేటర్ రమేష్ సహకరించారు. ఆ భూమిని సాగు చేసుకునేందుకు లోకేశ్వర్‌రెడ్డి ప్రయత్నిస్తుండగా స్వామినాథన్ అడ్డుకున్నాడు. ఈ భూమి తనదని లోకేశ్వర్‌రెడ్డి బెదిరించడంతో స్వామినాథన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రాన్ని డ్రగ్స్ రాజధానిగా మార్చేసిన వైసీపీ



పర్యటిస్తున్న బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, బైరెడ్డి శబరి

ఓర్వకల్లు, మార్చి 22: రాష్ట్రాన్ని డ్రగ్స్ రాజధానిగా వైసీపీ ప్రభుత్వం మార్చివేసిందని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, టీడీపీ నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బైరెడ్డి శబరి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, మహిళలపై, దళితులపై, బీసీలపై వైసీపీ ప్రభుత్వ హయాంలో దాడులు పెరిగాయన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెడతారన్నారు. బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి హయాంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎలాంటి ప్రాజెక్టులు చేయలేదని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో సిద్ధం అంటూ రావడానికి సిగ్గు లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునేశ్వరరెడ్డి, నాగిరెడ్డి, శ్రీరాములు, భూషన్న, నాగేశ్వరరావు, రామాంజనేయులు, కురువ జయన్న, వందనాలు పాల్గొన్నారు.

వలంటీర్ల తొలగింపు

కల్లూరు, మార్చి 22: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అతిక్రమించిన చిన్నటేకూరు గ్రామ సచివాలయం వలంటీర్ రామగోపాల్‌ను తొలగించినట్లు కల్లూరు ఎంపీడీఓ జీవీ రమణ మూర్తి తెలిపారు. సోషల్ మీడియాలో అధికార వైసీపీకి అనుకూలంగా పోస్టులు పెట్టారని ఫిర్యాదు అందడంతో విచారణ చేసి తొలగించామన్నారు. అలాగే కల్లూరు అర్బన్ 33వ వార్డులోని 99వ సచివాలయం వలంటీరు శివను తొలగించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. 33వ వార్డు పరిధిలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డితోపాటు పార్టీ కండువా మెడలో వేసుకుని ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని ఫిర్యాదు వచ్చింది. విచారణ అనంతరం ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన శివను తొలగించినట్లు స్పష్టం చేశారు.

బాలుడికి పాముకాటు

కర్నూలు ఆసుపత్రికి తరలింపు

గోనెగండ్ల, మార్చి 22: మండల పరిధిలోని చిన్న మరివీడు గ్రామానికి చెందిన ఆర్యన్(6) అనే బాలుడ్ని శుక్రవారం సాయంత్రం పాము కరిచింది. గ్రామానికి చెందిన లింగన్న కుమారుడు ఆర్యన్ బాత్‌రూమ్‌కు వెళ్లగా ఈ ఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యసేవల కోసం కర్నూలు అసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కొవెలకుంట్ల, మార్చి 22 : విద్యుదాఘాతంతో శుక్రవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని కంపమల్ల గ్రామానికి చెందిన తలారి శివరాముడు కుమారుడు శివప్రసాద్ (25) కోవెలకుంట్ల పట్టణంలోని పాండురంగస్వామి వెనుకభాగంలో ఉన్న వెల్డింగ్ షాపులో పని చేస్తున్నాడు. వెల్డింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ వైర్ గాయపడడంతో కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. మృతుని భార్య రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నందవరం, మార్చి 22 : రోడ్డు ప్రమాదంలో ప్రమాదానికి గురైన కురవ బీరప్ప చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఐదు రోజుల క్రితం నందవరం దగ్గరలోని ముగతి గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న బీరప్ప కుక్క అడ్డు రావడంతో కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి ఉంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

నందవరం, మార్చి 22: మండలంలోని నందవరం గ్రామ సమీపంలోని బైకు అదుపుతప్పిన ఘటనలో ప్రకాష అనే యువకుడు అక్కడిక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం జరిగింది. నందవరం ఎస్ఐ తిమ్మయ్య సంఘటన స్థలం దగ్గరకు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ప్రకాష్ మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి ఆత్మహత్య

బనగానపల్లె, మార్చి 22 : బనగానపల్లె పట్టణంలో శుక్రవారం ఉరి వేసుకొని ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. బీహార్‌కు చెందిన చంపాదే వి (30) పట్టణంలోని సాయిబాబా ఆలయ సమీపంలో గల ఓ ప్రైవేటు ఫ్యాక్టరీలో పని చేస్తోంది. ఈమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. వీఆర్వో ఈశ్వర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంట సుబ్బారావు తెలిపారు.

శ్రీశైల దేవస్థానంలో అంతర్గత బదిలీలు

శ్రీశైలం, మార్చి 22: శ్రీశైలం దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న 32 మంది శాశ్వత ఉద్యోగులు, పొరుగు సేవల సిబ్బందిని అంతర్గత బదిలీ చేస్తూ ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు ఉత్తర్వులను జారీ చేశారు. దేవస్థానం పరిపాలన సౌలభ్యం దృష్ట్యా ఈ బదిలీలు చేపట్టినట్లు తెలుస్తోంది. బదిలీలో భాగంగా కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం పదోన్నతిపై శ్రీశైలం దేవస్థానంలో విధులు కేటాయించిన డిప్యూటీ కమిషనర్, డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఆర్. రమణమ్మకు విధులను కేటాయించారు. వెంటనే రిపోర్టు చేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉల్లంఘించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

మినీ లారీ.. ఆర్టీసీ బస్సు ఢీ

15 మందికి గాయాలు



గాయాలపాలైన వ్యక్తిని తరలిస్తున్న పోలీసులు

బండిఆత్మకూరు, మార్చి 22: మండలంలో మినీ లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో 15 మంది గాయాలపాలయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 3.15 గంటల సమయంలో నంద్యాల నుంచి ఆత్మకూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, వెలుగోడు వైపు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న మినీ లారీ ఢీకొన్నాయి. ఆర్టీసీ బస్సులో ఉన్న బోయరేవుల మధుశేఖర్, మద్దయ్య, రూపనగుడి వెంకట సుబ్బయ్య, ఆత్మకూరుకు ప్రాంతానికి చెందిన తిక్కస్వామి, లింగమ్మ, డ్రైవర్ మహమ్మద్ ఖాజా, సుజాత, అహమ్మద్, చంద్రశేఖర్, రాముడు, అలాగే మినీ లారీలో ఉన్న వెలుగోడుకు చెందిన డ్రైవర్ నజీర్, ప్రవీణ్‌కుమార్, మల్లికార్జున, కంబగిరిలకు గాయాలయ్యాయి. వీరిలో కొందరికి బండిఆత్మకూరు ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించి, అనంతరం 108 వాహనంలో నంద్యాలు తరలించారు. మరికొందరు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

ఆంధ్రప్రగతి బ్యాంకులో చోరీకి యత్నం

సి. బెళగల్, మార్చి 22: మండల కేంద్రంలో ఉన్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో చోరీ చేయడానికి గుర్తు తెలియని దుండగులు గురువారం అర్ధరాత్రి ప్రయత్నించారు. అయితే బ్యాంక్ సైరన్ మోగడంతో దుండగులు పరార్ అయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ తిమ్మారెడ్డి క్లూస్ టీమ్‌తో విచారణ చేపట్టారు. ఎటువంటి ఆధారాలు లభించలేదు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

పెళ్లి ఇంట విషాదం

గోనెగండ్ల, మార్చి 22: గోనెగండ్లలోని ఎల్లెల్సీలో ప్రమాదవశాత్తు మునిగి అరుణ్‌కుమార్ (6) అనే బాలుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన లక్ష్మపేట కాలనీలో గొల్ల నాగరాజు అనే వ్యక్తి ఇంట్లోని వివాహానికి మల్కాపురం గ్రామానికి చెందిన ఎల్లారెడ్డి తన భార్య జ్యోతి, ఇద్దరు కుమారులతో హాజరయ్యాడు. చిన్న కుమారుడు అరుణ్‌కుమార్ మల్కాపురంలో ఒకటో తరగతి చదువుతున్నాడు. వివాహం అయ్యాక పెద్దలు పెళ్లి సందడిలో ఉండగా అరుణ్‌కుమార్, మరి కొంత మంది పిల్లలు కాలనీ పక్కనే ఉన్న ఎల్లెల్సీలో ఈత కొట్టేందుకు వెళ్లారు. పెద్ద పిల్లలు కాలువలో దూకి ఈత కొడుతుండగా అరుణ్‌కుమార్ కాలువ మెట్ల దగ్గర నీటిలో ఈత కొడుతున్నాడు. నీటి ప్రవాహం పెరగడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి పోయాడు. తోటి పిల్లలు కేకలు వేయడంతో అక్కడ ఉన్న వ్యక్తులు వచ్చి అరుణ్‌కుమార్‌ను బయటకు తీశారు. తల్లిదండ్రులు, బంధువులు బాలుడ్ని ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అరుణ్‌కుమార్ మృతదేహాన్ని సొంత గ్రామం మల్కాపురానికి తీసుకువెళ్లారు. బాలుడి మృతితో పెళ్లి ఇంట విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఆంధ్రజ్యోతి చిన్న ప్రకటన - పెద్ద స్పందన CLASSIFIEDS

వెంటనే కావలెను
ప్రముఖ MSS రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. అర్హత 1-3 సం॥ల అనుభవం + టీమ్ హ్యాండ్లింగ్ మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్ కలవు. సంప్రదించవలసిన సెల్ నెం. 70757 35115, కర్నూలు.
AJL-155742

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA-176974

FOR ADVERTISEMENTS CONTACT. Cell: 99854 11369

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
జన్మదిన శుభాకాంక్షలు
సెల్ : 99854 11369
ఆంధ్రజ్యోతి పత్రిక కోసం సంప్రదించండి.
సెల్ : 99854 11364
ఆంధ్రజ్యోతి కార్యాలయం : నియర్ ఇండస్ స్కూల్, పందిపాడు గ్రామం, కర్నూలు.
కర్నూలు : 99854 11141, 99854 02424, 99854 02544, 97036 18696, 99854 02890, 99591 77333, ఆదోని : 97036 18726, ఎమ్మిగనూరు : 78931 48646.
నంద్యాల : 99854 02121
డోన్: 94911 02749
నందికొట్కూరు : 83092 18935

'నీటిని పొదుపుగా వాడుకోవాలి'



పాములపాడులో నీటి వాడకంపై అవగాహన కల్పిస్తున్న ఏపీవో

పాములపాడు, మార్చి 22: నీటిని పొదుపుగా వాడుకోవాలని ఏపీవో విమలమ్మ సూచించారు. శుక్రవారం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా నీటి వాడకంపై ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. పాములపాడు, జూటూరు, వేంపెంట, కోల్స్ ఆనందాపురం, తుమ్మలూరు తదితర గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వర్షకాలంలో ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాలని. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే ఫారం పాండ్స్, చెక్‌డ్యాంలు, చెక్‌వాల్స్ నిర్మించుకొని నీటిని నిల్వ చేసుకొని భూగర్భ జలాలను పెంచుకోవాలని సూచించారు. నీటిని వృథా చేయవద్దని, చిన్నారులకు నీటి విలువను తెలియజేయాలని చెప్పారు. మండలంలోని దాదాపు అన్ని గ్రామాలలో ఉపాధి పని ప్రదేశాలలో ఉపాధి సిబ్బంది ద్వారా ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పాణ్యం: నీటిని కాపాడుకోవాలని పాణ్యం ఎంపీడీవో భాగ్యలక్ష్మి సూచించారు. వరల్డ్ వాటర్ డే సందర్భంగా ఏపీవో విజయరాణి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధి కూలీలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

స్తంభాన్ని సరిచేశారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నంద్యాల రూరల్, మార్చి 22: విద్యుత్ స్తంభాలు ఒరిగి ప్రమాదరంగా ఉండడంతో 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికతో శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. సిబ్బందిని భీమవరం గ్రామానికి పంపించి ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని సరిచేయించారు.

'వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలి'

బండిఆత్మకూరు, మార్చి 22: ఉపాధి హామీ పనుల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి డేవిడ్, సుబ్బరాయుడు, సీపీఎం నాయకుడు రాజు కోరారు. శుక్రవారం వారు మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయరావుకు వినతి పత్రం అందజేశారు. గత రెండు నెలలుగా వేతనాలు అందక, పూట గడవక కూలీలు అల్లాడి పోతున్నారన్నారు. వేతన బకాయిలు చెల్లించకపోతే కూలీలతో కలసి ఆందోళన చేపడతామన్నారు.

'మినహాయింపు ఇవ్వాలి'

గోస్పాడు, మార్చి 22: అనారోగ్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు పదో తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనం నుంచి మినహాయింపు ఇవ్వాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు కోరారు. శుక్రవారం గోస్పాడులో ఆయన మాట్లాడుతూ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు, 60 సంవత్సరాలు పైబడిన ఉపాధ్యాయులకు, రంజాన్ ఉపవాసం ఉన్న ఉపాధ్యాయులకు, అలాగే బాలింతలకు, గర్భిణులకు మూల్యాంకణం నుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పీఆర్‌టీయూ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, సురేష్ శర్మ, సుబ్బరాయుడు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



సెక్టోరల్ అధికారులకు అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్

నందికొట్కూరు, మార్చి 22: ఈవీఎంల పనితీరుపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సెక్టోరల్ అధికారులకు అసిస్టెంట్ ఆర్వో దామోదర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో సెక్టోరల్ అధికారులకు ఈ వీఎంలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

'క్షయ వ్యాధి నివారణపై అవగాహన ఉండాలి'

గోస్పాడు, మార్చి 22: క్షయ వ్యాధి నివారణపై అవగాహన కలిగి ఉండాలని గోస్పాడు పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాల్ సూచించారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గోస్పాడులో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ప్రభుత్వం క్షయ వ్యాధిగ్రస్థులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని, వ్యాధి లక్షణాలు ఉన్నవారు పీహెచ్‌సీ సెంటర్‌లో పరీక్షలు చేయించుకొని మాత్రలు మింగితే వ్యాధి నయమవుతుందని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ, శివకుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్: క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదని ఈ వ్యాధిపై ఎలాంటి భయాందోళన అవసరం లేదని వైద్యాధికారి పవన్‌కుమార్, టీబి సూపర్ వైజర్ కల్లూరి మస్తానయ్య గిరిజనులకు సూచించారు. శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ వారోత్సవాల సందర్భంగా మండలంలోని బైర్లూటి గిరిజన గూడెంలో క్షయ వ్యాధిపై గ్రామస్థులకు అవ గాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో దీపికా బాయి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'రాష్ట్ర ప్రయోజనాలే టీడీపీ ఎజెండా'

పాణ్యం, మార్చి 22: రాష్ట్ర ప్రయోజనాలే టీడీపీ ఎజెండా అని టీడీపీ ముస్లీం మైనారీ విభాగం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఖాదర్‌బాషా అన్నారు. టీడీపీ శంఖారాంలో భాగంగా శుక్రవారం స్థానిక ఇందిరానగర్‌లో టీడీపీ అజెండా కరపత్రాలు ఇంటింటికి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చెంచుల అభివృద్ధికి టీడీపీ ఎంతో కృషి చేసిందన్నారు. టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని అన్నారు. టీఎన్ఎస్ఎఫ్ కన్వీనర్ మహబూబ్‌బాషా, రవి, మేకల మాధవి, బాపట్ల ఉశేని, చెంచురాజు, విజయుడు, వీరాస్వామి, చెంచు మహిళలు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

నంద్యాల (నూనెపల్లె), మార్చి 22: భగత్‌సింగ్ 93వ వర్ధంతిని నంద్యాలలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద పీడీఎస్‌యూ నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. జిల్లా కార్యదర్శి రాంబాబు అధ్యక్షతన శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న మత విద్వేష, ఉన్మాద దాడులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. భారతీయ సమాజాన్ని పట్టిపీడిస్తున్న రుగ్మతల్లో మతం ఒకటంటూ భగత్‌సింగ్ స్పష్టమైన వైఖరితో ఉన్నారని గుర్తు చేశారు. భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకొని యువత పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. దేశంలోని మతోన్మాదంపై వ్యతిరేక పోరాటమే భగత్‌సింగ్‌కు నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, చంద్ర, సతీష్, శివ, సూర్య, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE
UNDER the instructions of my Client M/s. Shriram Finance Limited, Chennai, Branch at Nandyal. I issue the following notice to general public. My Clients intends to grant loan to ఉయ్యాలవాడ రాముడు, S/o యు.వెంకటేశం, కందికాయపల్లె గ్రామం, పాణ్యం మం. by keeping the below mentioned propertie of him as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges, Mort gages, Sale agreements, Court attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.
Sy.No. 480-1 పైకి
విస్తీర్ణము : 0.04 సెంట్లు, ప్లాటు నెం : 2
BOUNDARIES: తూర్పు : ప్లాట్ నెం:1, పడమర : ప్లాట్ నెం:3, ఉత్తరం : పంటపొలం, దక్షిణం : 30 లింకుల వెడల్పు గల రస్తా
T.V. PRASAD
Advocate, Nandyal.

భ్రమరాంబకు కొబ్బరికాయల సమర్పణ

శ్రీశైలం, మార్చి 22: శ్రీశైల మహాక్షేత్రంలో చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం గానీ, శుక్రవారం రోజున గానీ భ్రమరాంబ అమ్మవారికి కుంభోత్సవం జరిపించడం సంప్రదాయం. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఏప్రిల్ 26న కుంభోత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారికి సాత్వికబలి నిర్వహించేందుకు కుంభోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. ఈ కుంభోత్సవాన్ని పురస్కరించుకొని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే వచ్చే ప్రతి మంగళవారం, శుక్రవారం రోజులలో అమ్మవారికి కొబ్బరి కాయలను సమర్పిస్తారు. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయ ప్రదక్షిన మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో పూజాధికాలు నిర్వహించి అనంతరం అమ్మవారికి సమర్పించారు.



కొబ్బరికాయల సమర్పణ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు

- శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయలసేవను నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా మహా గణపతి పూజ చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామపూజలు, స్వామివారికి సహస్రనామార్చన పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. అలాగే గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, విశేష అలంకరణ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు.
- శ్రీశైల క్షేత్రంలో శుక్రవారం త్రయోదశిని పురస్కరించుకొని సాయంప్రదోషకాలంలో ఆలయ ప్రాంగణంలో మల్లికార్జునస్వామికి అభిముఖంగా కొలువైవున్న నందీశ్వరస్వామికి పరోక్షసేవగా విశేష అభిషేక అర్చనలను దేవస్థానం నిర్వహించింది. ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతికి ప్రత్యేక పూజలు జరిపి, అనంతరం నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, పలు ఫలోదకాలతో, కుంకుమోదకం, హరిద్రోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం, మల్లికార్జున గుండంలోని శుద్ధజలాలతో అభిషేకం నిర్వహించి అనంతరం అన్నాభిషేకం జరిపారు. అభిషేకానంతరం నందీశ్వరస్వామికి నూతన వస్త్రసమర్పణ, విశేష అర్చనలు జరిపి, నానబెట్టిన శనగలను సమర్పించారు. శ్రీశైల క్షేత్రానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు వారి గోత్రనామాలతో పూజలలో పాల్గొనేందుకు దేవస్థానం ఈ పరోక్షసేవల ద్వారా అవకాశం కల్పించింది. భక్తులు ఈ పరోక్ష సేవలో పాల్గొనేందుకు దేవస్థానం వెబ్‌సైట్ www.srisailadevasthanam.org లో గానీ, ఆన్‌లైన్ ద్వారా ఒక్కోపూజకు రూ. 1,116 లు సేవా రుసుము చెల్లించి పాల్గొనవచ్చును. సేవాకర్తలే కాకుండా, భక్తులందరూ కూడా ఆర్జిత పరోక్షసేవ పూజా కార్యక్రమాలను శ్రీశైలటీవీలో గానీ, యూట్యూబ్‌లో గానీ వీక్షించవచ్చును.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం



కల్యాణాన్ని జరిపిస్తున్న వేదపండితులు

నంద్యాల (కల్చరల్), మార్చి 22: నంద్యాల పట్టణంలోని గిరినాథ్ సెంటర్ దగ్గరలో శుక్రవారం లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం శోభాయమానంగా నిర్వహించారు. అహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహ స్వామి కల్యాణాన్ని గిరినాథ్ సెంటర్‌లో అహోబిలం హిందూ అన్నదానసత్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం స్వామికి పంచామృత అభిషేకాలు, తిరుమంజనసేవ, స్వామి కల్యాణం నిర్వహించి, మహిళలకు పసుపు, గాజులు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించి అహోబిలంలో జరిగే బ్రహ్మోత్సవాలకు బయలుదేరి అక్కడ అన్నదానం చేసేందుకు హిందూ అన్నదాన సత్రం కమిటీ భక్త బృందం బయలుదేరి వెళ్లింది.

క్రీడా పోటీలు ప్రారంభం



గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న కళాశాల డైరెక్టర్

పాణ్యం, మార్చి 22: మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో ఆరో మహా సంగ్రామ్ క్రీడలు ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలను ఆర్జీఎం డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్ ప్రారంభించారు. ఈక్రీడల్లో కళాశాలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు కళాశాల పీడీ చంద్రారెడ్డి తెలిపారు. క్రికెట్, కబడ్డీ, త్రోబాల్ విభాగాలలో పురుషులు, స్త్రీలు పాల్గొన్నారని చెప్పారు. అశోక్ మాట్లాడుతూ ఈ క్రీడల ద్వారా తమ నైపుణ్యాలను ప్రదర్శించుకోవడానికి క్రీడాకారులకు ఇది మంచి వేదికన్నారు. క్రీడా స్ఫూర్తితో ఆటలాడుకోవాలన్నారు. కార్యక్రమంలో శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, శాంతిరాం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ శెట్టి, పీడీలు, వలంటీర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీకి రాజీనామా

ఆత్మకూరు, మార్చి 22: రాష్ట్రంలో వైసీపీ పాలనతో ముస్లింలకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ వైసీపీ నాయకులు మోమిన్ ఇబ్రహీం ఖలీలుల్లా శుక్రవారం వైసీపీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూరు ప్రాంతంలో సుమారు 60ఏళ్ల పాటు తమ కుటుంబీకులు సర్పంచ్‌గా పనిచేసి ఇక్కడి ప్రజలకు సేవలందించారని చెప్పారు. ఈక్రమంలోనే తాను గత మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ దాఖలు చేశానని తెలిపారు. అయితే నామినేషన్ వెనక్కి తీసుకొంటే తనకు ప్రాధాన్యత కల్పించి నామినేటెడ్ పదవి అప్పగిస్తానని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హామీ ఇవ్వడంతో నామినేషన్‌ను ఉపసంహరించుకున్నట్లు చెప్పారు. అయితే ఇచ్చిన హామీని నెరవేర్చకుండా తనను నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. అంతేకాకుండా వైసీపీ పాలనలో ముస్లింలకు అన్నివిధాలుగా అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సీఎం జగన్, నియోజకవర్గంలో ఎమ్మెల్యే శిల్పా వైఖరి నచ్చకే వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు.

సమీక్షలో జిల్లా అధికారులు

నంద్యాల (కల్చరల్), మార్చి 22: రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తీరును సమీక్షించారు. కలెక్టర్ చాంబర్ నుండి జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ వచ్చే నెల 3వ తేదీన సీజర్ అంశంపై సీఎస్, డీజీపీలతో భారత ఎన్నికల సంఘం అధికారులు సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టం వినియోగాన్ని విస్తృతం చేయాలని ఆదేశించారు.

అభ్యర్థుల వ్యయాన్ని జాగ్రత్తగా లెక్కించాలి: జేసీ

నంద్యాల (కల్చరల్), మార్చి 22: వచ్చే సాధారణ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఖర్చు చేసే వ్యయాన్ని జాగ్రత్తగా లెక్కింపు వేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి సహాయ వ్యయ లెక్కింపు అధికారులు, వీడియో సర్వేలైన్ టీమ్‌లు, వీడియో వ్యూవింగ్ టీమ్‌లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల వ్యయ పరిమితిపై సహాయ లెక్కింపు, వీడియో సర్వేలైన్ టీం అధికారుల శిక్షణా కార్యక్రమంలో జేసీ, డీఎస్పీ తదితరులు పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రకటనలు, పోస్టర్లు, బ్యానర్లు, వాహనాలు, ఆహార పదార్థాల ఖర్చుతో సహా లెక్కించాలన్నారు. ఈమేరకు ఖర్చులు లెక్కకట్టి ఏరోజుకారోజు నివేదికలు ఇవ్వాలని సూచించారు. నంద్యాలలోని నంది లిక్కర్ ఫ్యాక్టరీలో మద్యం ఎంతవరకు డిస్ట్రిబ్యూషన్ అవుతుందో రోజువారీ అప్‌డేట్ తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ నుంచి వచ్చిన అడ్వర్‌టైజ్‌మెంట్స్, పెయిడ్‌న్యూస్‌కు సంబంధించిన వాటిని కూడా లెక్కకట్టి అభ్యర్థుల ఖాతాలో నమోదు చేయాలన్నారు. పోటీ చేసే అభ్యర్థి మూడు రోజులు ముందుగా మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ అనుమతులు తీసుకోవాలన్నారు. సోషల్‌మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే ప్రతి సమాచారాన్ని పరిశీలించాలన్నారు. పాండురంగాపురం టెంపుల్ ఆవరణలో పార్టీకి సంబంధించిన పాటలు పెట్టినందుకు సంబంధిత టెంపుల్ కమిటీ వారిపై ఎఫ్ఐఆర్ ఫైల్ చేస్తూ నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

కమనీయం.. మహానందీశ్వరుడి కల్యాణం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, మార్చి 22: మహానంది క్షేత్రంలో లోక క్షేమం కోసం మహానందీశ్వరుడి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని తెలిపారు. శుక్రవారం మహానంది క్షేత్రంలోని అలంకార మంటపంలో మహానందీశ్వరుడు, పార్వతీదేవి ఉత్సవమూర్తుల విగ్రహాలను అర్చకులు ఆశీనులు గావించారు. అనంతరం వేదమంత్రాలతో స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని కన్నుల పండువగా ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం నిత్యాన్నదాన సత్రం కూరగాయల దాత లక్కబోయిన ప్రసాద్, వేదపండితులు నాగేశ్వరశర్మ, హనుమంత్‌శర్మ, అర్చకులు పుల్లూరి హరి శర్మ, జనార్దన్‌శర్మ పాల్గొన్నారు.

రమణీయం.. రథోత్సవం



కొణిదేలలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి రథోత్సవం

నందికొట్కూరు రూరల్ మార్చి 22: కొణిదేల గ్రామంలో వెలసిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి రథోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తిరుణాళ్ల మహోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శివనామాన్ని స్మరిస్తూ రథాన్ని లాగారు. కార్యక్రమంలో గ్రామ రైతు సంఘం నాయకులు, భక్తులు, వివిధగ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

మే 1 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

నంద్యాల (నూనెపల్లె), మార్చి 22: ఏపీ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని వివిధ కేంద్రాలలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ప్రాధికార సంస్థ అధికారి రాజు శుక్రవారం తెలిపారు. జిల్లాలో 50 కేంద్రాలలో మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అన్ని క్రీడా విభాగాలలో వేసవి శిక్షణా శిబిరాలు జరుగుతాయని చెప్పారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నియమ నిబంధనల ప్రకారం 8 సంవత్సరాల నుంచి 14 ఏళ్ల వయస్సు ఉన్న క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి ప్రతిభా క్రీడాకారులను గుర్తించి వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. శిక్షణా శిబిరాలు నిర్వహించేందుకు ఆసక్తి కలిగిన క్రీడా సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు ఏప్రిల్ 5వ తేదీ లోపు నంద్యాలలోని పద్మావతినగర్‌లో ఉన్న జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ స్పోర్ట్స్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. మరింత సమాచారం కోసం 8712622576 నంబర్‌కు సంప్రదించాలని అన్నారు.

ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పగిడ్యాల, మార్చి 22: మండలంలోని ప్రాతకోట గ్రామానికి చెందిన దొంతుల వెంకటేశ్వర్లుపై శుక్రవారం ఉదయం ఎలుగుబంటి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. ప్రాతకోట గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు చేపలు పట్టేందుకు గణపురం సమీపంలోని గనేట్ గుంతల్లోకి వెళ్లారు. అక్కడ చేపలు పడుతుండగా ఎలుగుబంటి దాడి చేసినట్లు తెలిపారు. భయాందోళనలకు గురైన వెంకటేశ్వర్లు కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్లు గమనించి ఎలుగుబంటి నుంచి కాపాడారు. కుటుంబ సభ్యులు వెంకటేశ్వర్లును చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సాయుధ బలగాల కవాతు

పాములపాడు, మార్చి 22: సాధారణ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని గ్రామాలలో కేంద్ర సాయుధ బలగాల కవాతు నిర్వహించారు. శుక్రవారం పాములపాడు ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో రుద్రవరం, జూటూరు, క్రిష్ణరావుపేట, తుమ్మలూరు గ్రామాలలోని ప్రధాన రహదారులలో సాయుధ బలగాల కవాతు నిర్వహించారు. ఆయా గ్రామాలలోని ప్రధాన కూడళ్లలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

గడివేముల, మార్చి 22: మండల కేంద్రంలోని మూలపెద్దమ్మ ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం హుండీ లెక్కించారు. భక్తులు అమ్మవారికి చెల్లించిన ముడుపులను లెక్కించగా రూ.4,54,522 ఆదాయం వచ్చిందని చెప్పారు. తలనీలాలు పోగు చేసేందుకు వేలం పాటలు నిర్వహించగా రూ.1,67,500 పలికిందని తెలిపారు. ఈ వేలం పాటలో ఆలయ కార్యనిర్వాహణాధికారి మోహన్, ఆలయ చైర్మన్ చిన్నన్న, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి: గౌరు



టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులతో గౌరు దంపతులు

గడివేముల, మార్చి 22: వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి సైనికుల్లా పని చేయాలని టీడీపీ నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, పాణ్యం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌరు చరిత కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు దేశం సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో గౌరు సమక్షంలో శుక్రవారం కొర్రపోలూరు గ్రామానికి చెందిన హసన్, నబీరసూల్, షేక్ నబిసా, అలిబాషా, మాలిక్‌బాషా, చిన్నస్వామి, జమ్మలయ్య, వెంకటశివుడు కర్నూలులోని గౌరు స్వగృహంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

'రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన జగన్'



సమావేశంలో మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

కొత్తపల్లి, మార్చి 22: సీఎం జగన్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం సుమారు వంద కుటుంబాలు కొత్తపల్లిలో వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి బైరెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కొత్తపల్లి మాజీ సర్పంచ్ శ్రీనాథరెడ్డి, ఉప సర్పంచ్ రమణయ్య, వైసీపీ నాయకులు శివారెడ్డి, శివన్న, గూడెం మల్లయ్యలతో పాటు 30 కుటుంబాలు, సింగరాజపల్లె నుంచి 15 కుటుంబాలు, జడ్‌వారిపల్లె నుంచి 15 కుటుంబాలు, ఎదురుపాడు నుంచి 10 కుటుంబాలు, లింగాపురంలో 10 కుటుంబాలు, దుద్యాలలో 30 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. అనంతరం కొత్తపల్లిలోని రాజరాజేశ్వరి పాఠశాల ఆవరణలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో బైరెడ్డి మాట్లాడారు. రాక్షస పాలన అంతం కావాలంటే టీడీపీ కూటమిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, బీజేపీ సీనియర్ నాయకులు మల్లెల కృష్ణారెడ్డి, మండల నాయకులు శంకర్‌గౌడు, మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'వచ్చేది టీడీపీ ప్రభుత్వమే: బుడ్డా



బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

మహానంది/వెలుగోడు, మార్చి 22: వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మహానందికి చెందిన టీడీపీ గ్రామ ఇన్‌చార్జి గని చిన్న రంగస్వామి, సూరే శ్రీనివాసులు ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు శుక్రవారం వేల్పనూరులో టీడీపీ మాజీ ఎమ్మెల్యే బుడ్డా నివాసంలో ఆయన సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఉమాదేవి, సురసుర చంద్ర, నాగరాజు, నరసింహం, చాముండీ, మాధవి, సావిత్రి ఆధ్వర్యంలో 80 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. రాజశేఖర్‌రెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీపై రోజు రోజుకు ప్రజాదారణ పెరుగుతోందన్నారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త బన్నూరి రామలింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: సిద్ధాపురం గ్రామ సర్పంచ్ పీట్ల వెంకటరమణ, వలంటీర్ దరగయ్యతోపాటు మరో వంద కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. ముందుగా గ్రామంలో రామాలయంలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ తర్వాత ర్యాలీగా సభా స్థలికి చేరుకున్నారు. ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో తనను గెలిపిస్తే సిద్ధాపురం గ్రామంలో యథేచ్ఛగా సారా తయారీ చేసినా పోలీసు కేసుల్లేకుండా చేస్తానని ఎమ్మెల్యే శిల్పా హామీ ఇవ్వడం సిగ్గుచేటని విమర్శించారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణు గోపాల్, నాయకులు శాకమూరి గిరిరాజు, యుగంధర్‌రెడ్డి ఉన్నారు.

'వైసీపీకి గుణపాఠం చెప్పాలి'



శంఖారావంలో పాల్గొన్న శివానందరెడ్డి, జయసూర్య

జూపాడుబంగ్లా, మార్చి 22: పెట్రోల్, డీజిల్, విద్యుత్, ఆర్టీసీ చార్జీలు పెంచి పేద, మధ్యతరగతి కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తూ ప్రజావ్యతిరేక విధానాలు అవలబిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తజయసూర్య ప్రజలను కోరారు. మండలంలోని తరిగోపుల గ్రామంలో శుక్రవారం శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. జగన్‌కు మళ్లీ అధికారం ఇస్తే రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తారని అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని అన్నారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను ప్రజలకు అందజేశారు. నాయకులు గిరీశ్వరరెడ్డి, నారాయణ రెడ్డి, దొరబాబురెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసులు, వేణుగోపాల్‌రెడ్డి, రఘుయాదవ్, కాంత్, సుధాకర్, బాబు పాల్గొన్నారు.

'ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు'

గడివేముల, మార్చి 22: ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య అన్నారు. బిలకలగూడురు గ్రామంలో శుక్రవారం రాజకీయ నాయకులతో, ప్రజలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని అన్నారు.

'విధుల్లో నిర్లక్ష్యం వద్దు'

వెలుగోడు, మార్చి 22: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నంద్యాల డీఎల్‌డీవో మురళి కళ్యాణి అన్నారు శనివారం వెలుగోడు పట్టణంలోని 4, 5 సచివాలయాలతో పాటు పలు మీ సేవా కేంద్రాలను తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, వీఆర్వో అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

64 మంది విద్యార్థుల గైర్హాజరు

కొత్తపల్లి, మార్చి 22: మండలంలోని గోకవరం, కొత్తపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న పది పబ్లిక్ పరీక్షలకు శుక్రవారం 64 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయా సెంటర్ల చీఫ్ ఎగ్జామినర్లు రఘుస్వామి, ఇబ్రహీం తెలిపారు. శుక్రవారం జరిగిన మ్యాథ్స్ పరీక్షకు కొత్తపల్లి సెంటరులో 221 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 181 మంది హాజరు కాగా, 40 మంది గైర్హాజరయ్యారు. అలాగే గోకవరం సెంటరులో 128 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 104 మంది హాజరు కాగా, 24 మంది గైర్హాజరయ్యారు. ఈ సెంటర్లను పాములపాడు ఎంఈవో బాలాజీ తనిఖీ చేశారు.

టీడీపీతోనే ముస్లింల అభివృద్ధి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న కోట్ల రాఘవేంద్రరెడ్డి

ప్యాపిలి, మార్చి 22: టీడీపీతోనే ముస్లింల అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ యువ నాయకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని జామియా మసీదులో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన ముస్లిం సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు కోట్ల శ్రీనాథ్‌రెడ్డి, లక్కసాగరం లక్ష్మీరెడ్డి, ఖాజాపీర్ తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డి శబరిని కలిసిన డోన్ నాయకులు



బైరెడ్డి శబరికి శుభాకాంక్షలు తెలుపుతున్న డోన్ టీడీపీ నాయకులు

డోన్, మార్చి 22: నంద్యాల పార్లమెంటు టీడీపీ అభ్యర్థిగా బైరెడ్డి శబరి పేరు పార్టీ నాయకత్వం శుక్రవారం ప్రకటించడంతో డోన్ నియోజకవర్గ టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కర్నూలులోని ఆమె నివాసంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై. నాగేశ్వరరావు యాదవ్, వలసల రామక్రిష్ణ, డోన్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ప్యాపిలి మండల పార్టీ అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య, ఎస్ఎండీ రఫీ, మిద్దెపల్లి గోవిందు, కలచట్ల ప్రసాద్ తదితరులు బైరెడ్డి శబరికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. త్వరలోనే నియోజకవర్గంలో పర్యటిస్తానని, టీడీపీ గెలుపునకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని శబరి అన్నారు. ఈ సందర్భంగా వై. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నమ్మకాన్ని వమ్ము చేయకుండా టీడీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేశామన్నారు.

బైరెడ్డి శబరికి టికెట్ కేటాయింపుపై హర్షం

డోన్(రూరల్), మార్చి 22: నంద్యాల పార్లమెంటు టీడీపీ అభ్యర్థిగా బైరెడ్డి శబరికి టికెట్ కేటాయింపుపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నంద్యాల జిల్లా పార్లమెంటు ఉమ్మడి అభ్యర్థిగా బైరెడ్డి శబరిని ప్రకటించడంపై డోన్‌కు చెందిన బీజేపీ జిల్లా కార్యదర్శి వడ్డె మహారాజ్ హర్షం వ్యక్తం చేశారు. బైరెడ్డి శబరి గెలుపు కోసం కృషి చేస్తామ న్నారు.

'టీడీపీతోనే పేదల సంక్షేమం'

చాగలమర్రి, మార్చి 22: రాష్ట్రంలో టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని ఆళ్లగడ్డ టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టో గురించి ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేశారు. టీడీపీ నాయకులు నరసింహారెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, రామనరసింహారెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్ష కేంద్రాల తనిఖీ

చాగలమర్రి, మార్చి 22: చాగలమర్రి గ్రామంలోని పది పరీక్ష కేంద్రాలను జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ప్రతాప్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. బాలుర, బాలికల, సెయింట్ ఆన్స్ పాఠశాలలో జరుగుతున్న పది పరీక్షా కేంద్రాలను సందర్శించారు. విద్యార్థుల మౌళిక వసతులను, ప్రశ్న పత్రాల రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల ఉన్నారు.

రుద్రవరం: మండలంలోని రుద్రవరం, నరసాపురం పది పరీక్ష కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేసినట్లు తహసీల్దారు మురళీమోహన్ తెలిపారు. నరసాపురంలో 218 మందికి గాను 196 మంది హాజరు కాగా 22 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. రుద్రవరంలో 262 మంది విద్యార్థులకు గాను 32 మంది గైర్హాజరయ్యారన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి: ఆర్డీవో

నంద్యాల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఎన్నికల నియమ నిబంధనలను పాటించాలని ఆర్డీవో మల్లికార్జునరెడ్డి సూచించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. అభ్యర్థులు ఎన్నికల సమయంలో ఖర్చు వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని, పరిమితికి మించి వాహనాలను వాడరాదని, వాహనాల్లో అనుమతి మేరకే వ్యక్తులు ప్రయాణం చేయాలని సూచించారు. సమావేశంలో ఏఆర్వో నజీర్ అహమ్మద్, డీఎస్పీ షర్ఫుద్దీన్, సీఐలు రమేష్‌బాబు, హనుమంతనాయక్, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి: ఆర్వో



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి

డోన్(రూరల్), మార్చి 22: రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని పాటించాలని డోన్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో మహేశ్వరరెడ్డి అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారం, ర్యా లీలు తదితర వాటికి సంబంధించి తప్ప నిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. రాత్రి 10 గంటల లోపు ఎన్నికల ప్రచా రాన్ని ముగించాలన్నారు. రాత్రి 10 గంట లు దాటిన తర్వాత కూడా ప్రచారాలు కొనసాగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డోన్, బేతంచెర్ల తహసీల్దార్లు మాధవకృష్ణారెడ్డి, జీవన్‌కిషోర్ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

UNDER the instructions of my Client M/s. Shriram Finance Limited, Chennai, Branch at Nandyal. I issue the following notice to general public. My Clients intends to grant loan to కాకి విజయలక్ష్మి, W/o రామమోహన్, ఇందిరానగర్, కోవెలకుంట్ల. by keeping the below mentioned propertie of him as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges, Mort gages, Sale agreements, Court attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

Sy.No. 151 పైకి
విస్తీర్ణము : 0.42 సెంట్లు,
BOUNDARIES: తూర్పు : రవీంద్రనాథ్‌రెడ్డి భూమి, పడమర : మునిస్వామి భూమి, ఉత్తరం : పోచాబ్రహ్మానందరెడ్డి వేర్‌హౌస్, దక్షిణం : R & B రోడ్

T.V. PRASAD
Advocate, Nandyal.

ఘనంగా శాలివాహన జయంతి

బనగానపల్లె, మార్చి 22: పట్టణంలో కుమ్మరశాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శాలివాహన చక్రవర్తి జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుమ్మరిశాలివాహన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా వలసలు

బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో వైసీపీకి చెందిన 75 కుటుంబాల చేరిక



వైసీపీ నాయకులకు కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మార్చి 22: బనగానపల్లె నియోజకవర్గంలో రోజు రోజుకూ వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి భారీగా వలసలు పోటెత్తు తున్నాయి. శుక్రవారం మండలంలోని బనగానపల్లె మండలంలోని పాత పాడు, జోలాపురం, మాదాసుపల్లె గ్రామాలకు చెందిన 75 కుటుంబాలు వైసీపీని వీడి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో రాష్ట్రం లో టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం ఏర్పడబోతోందన్నారు. అందరూ కలసికట్టుగా ఓట్లువేసి చంద్రబాబునాయుడును సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. బనగానపల్లెలో టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి కుంటు బడిందన్నారు. చంద్రబాబు హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు.టీడీపీలో చేరిన నాయకులకు ఎవరి గౌరవానికి ఇబ్బంది కలుగకుండా అందరినీ గౌరవిస్తామన్నారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి కుంటు బడిందన్నారు. చంద్రబాబునాయుడు హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకే వైసీపీని వీడి టీడీపీలో చేరడం జరిగిందని తెలిపారు. దద్దనాల ప్రాజెక్టుకు లిఫ్ట్ ఇరిగేషన్ తెచ్చి పడమటి పల్లెల దాహార్తిని తీర్చిన అపరభగీరథుడు బీసీజనార్దన్‌రెడ్డి అని తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఎస్సార్బీసీ నీటిని దద్దనాల ప్రాజెక్టుకు కనీసం లిఫ్ట్ చేయించలేదన్నారు. దీంతో పడమటి పల్లెల్లో బోర్లలో భూగర్భ జలాలు తగ్గిపోయాయన్నారు. దీంతో త్రాగు, సాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. బీసీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. అందుకే టీడీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. టీడీపీ అమలు పరిచే సూపర్ సిక్స్ పథకాలతోనే ఏపీకి నిజమైన సంక్షేమం వస్తుందని తెలిపారు. టీడీపీలో వారిలో చిన్నస్వామి, నాగేంద్ర, సురేశ్, మం గళ సుబ్బారెడ్డి, రామసుబ్బయ్య, రామదాసు, వెంకటసుబ్బయ్య ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డితోపాటు అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల విశ్వాసం కోల్పోయిన వైసీపీ: కోట్ల సుజాతమ్మ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కోట్ల సుజాతమ్మ

డోన్, మార్చి 22: ప్రజల విశ్వాసం కోల్పోయిన వైసీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో పతనం తప్పదని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆమె మాట్లాడుతూ తాను ఇచ్చిన హామీలలో సీఎం జగన్ ఇచ్చిన ఒక్కటి కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. వైసీపీ హామీలపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. రాష్ట్ర సంపదను, ప్రజాధనాన్ని వైసీపీ నాయకులు లూటీ చేశారే తప్ప.. ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమీ లేదని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి రాజధాని లేకుండా చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. నియోజకవర్గంలో కరువు పరిస్థితులు తాండవిస్తున్నా రైతులను ఆదుకోవడంలో మంత్రి బుగ్గన విఫలమయ్యారని అన్నారు. మండలంలోని దొరపల్లి గ్రామంలో టీడీపీ కార్యకర్త మృతికి కోట్ల సుజాతమ్మ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, భాస్కర్ నాయుడు ఉన్నారు.

సైకో జగన్‌కు బుద్ధి చెప్పాలి: కోట్ల చిత్రమ్మ

బేతంచెర్ల, మార్చి 22: రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని డోన్ టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల చిత్రమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం నగర పంచాయతీలోని 7, 13 వార్డుల కౌన్సిల్‌లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, మండల కన్వీనర్ ఉన్నం ఎల్లనాగయ్య అధ్యక్షతన నిర్వహించారు. అలాగే 7, 13 కౌన్సిల్‌లో స్థానిక టీడీపీ నాయకులు బుగ్గన మాధవిరెడ్డి, కాకర్ల తిరుమలేష్ చౌదరి, అరుణ్ బాబు, గూటం శివ, రామవరం శివ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల చిత్రమ్మ మాట్లాడుతూ జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే తెలుగుదేశం పార్టీ దళితుల కోసం ప్రవేశ పెట్టిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి దళిత ద్రోహిగా మిగిలారన్నారు. సైకో జగన్ రెడ్డికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో కోట్ల గిరిధర్ రెడ్డి, జన సేన నాయకులు చల్లా మద్దిలేటి స్వామి, నాగరాజు, శ్రీకంటి మధు పాల్గొన్నారు.

వలంటీర్, ఫీల్డ్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసులు



షాధిఖానా శిలాఫలకానికి అతికించిన వైట్ స్టిక్కర్లు

డోన్, మార్చి 22: డోన్ మండలంలోని కామగానిగుంట్ల గ్రామానికి చెందిన వలంటీర్ రవికళ్యాణ్, ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్‌లకు శుక్రవారం డోన్ ఎంపీడీవో శ్రీనివాసులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీరిద్దరూ వైసీపీ ప్రచార ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్న చిత్రాలతో మేమింతే.. మారేదేలే అనే శీర్షిక కింద ఆంధ్రజ్యోతి మెయిన్‌లో కథనం ప్రచురితమైంది. దీనికి డోన్ ఎంపీడీవో శ్రీనివాసులు స్పందించి వలంటీర్ రవికళ్యాణ్‌కు, ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. వారితో సంజాయిషీ కూడా తీసుకున్నట్లు తెలిపారు. కలెక్టర్‌కు నివేదిక పంపుతున్నామని, కలెక్టర్ ఆదేశాలనుబట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు. పట్టణంలోని షాదిఖానాలో శిలాఫలకంలో మంత్రి బుగ్గన ఫొటో కనిపించకుండా స్టిక్కర్లను అతికిస్తూ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రాంతీయ వైద్యశాల ఆవరణలో ఉన్న బోర్డులో సీఎం ఫొటోకు స్టిక్కర్లను వేశారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

బేతంచెర్ల, మార్చి 22: ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణ అధికారి కామేశ్వరరావు సూచించారు. శుక్రవారం పట్టణంలో సంజీవనగర్‌కు చెందిన రాజశేఖర్, వెంకటేశ్వరి దంపతుల కుమార్తె రిషిత (10) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమాచారం తెలుసుకున్న మలేరియా నివారణ అధికారి వైద్యసిబ్బందితో వెళ్లి బాలిక ఇంటి పరిసరాలను పరిశీలించారు. రెండు రోజుల క్రితం బాలికకు బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో డెంగీ పరీక్ష నిర్వహించగా.. వ్యాధి లక్షణాలు ఉన్నట్లు తేలిందని, వెంటనే తల్లిదండ్రులు రిషితను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స నిర్వహిస్తున్నారు. అనంతరం మలేరియా అధికారి బేతంచెర్ల జిల్లా సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలోని ల్యాబ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈయన వెంట వైద్యసిబ్బందితో పాటు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

కోటపాడులో ఉచిత వైద్యశిబిరం

కొలిమిగుండ్ల, మార్చి 22: మండలంని కోటపాడు గ్రామంలో రామ్‌కోసిమెంట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. బీపీ, షుగర్ , శ్వాసకోశ, ఉదరకోశ, చర్మవ్యాధులతోపాటు సాధారణ వ్యాధులైన జ్వరం, తలనొప్పి , కీళ్లనొప్పులు జలుబు, దగ్గుతో బాధపడుతున్న వారిని వైద్య సిబ్బంది పరిశీలించి నెలకు సరిపడా మందులు 107 మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామ్‌కో సిమెంట్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

డోన్, మార్చి 22: మండలంలోని దొరపల్లె గ్రామంలో టీడీపీ కార్యకర్త గిరి మృతికి శుక్రవారం టీడీపీ యువ నాయకుడు ధర్మవరం గౌతమ్ రెడ్డి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

కార్యదర్శిపై డీపీవోకు నివేదిక

రుద్రవరం, మార్చి 22: మండలంలోని నరసాపురం సచివాలయంలో పనిచేస్తున్న గ్రేడ్-5 కార్యదర్శి నాగేశ్వర్‌రెడ్డిపై డీపీవోకు నివేదికలు శుక్రవారం పంపినట్లు ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. ఈ నెల 1తేదీ నుంచి 11 వరకు శ్రీశైలం బ్రహ్మోత్సవాల్లో విధులు నిర్వహించారు. అప్పటి నుంచి రీజాయినింగ్ లెటరు ఇంత వరకు ఇవ్వలేదని ఆయన చెప్పారు. ఈ మేరకు గ్రేడ్-5 కార్యదర్శి విధి నిర్వహణపై డీపీవోకు నివేదిక పంపామన్నారు. అలాగే ఫిబ్రవరి 21న షోకాజ్ నోటీసు ఇవ్వగా ఇంత వరకు సంజాయిషీ కూడా ఇవ్వలేదని ఎంపీడీవో తెలిపారు. దీంతో అన్ని వివరాలతో కూడిన నివేదికను డీపీవోకు పంపామన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ

నంద్యాల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని విత్తన దుకాణాలను శుక్రవారం రాష్ట్ర వ్యవసాయాధికారి వీఎస్ సురేష్ మండల వ్యవసాయాధికారి కిశోర్‌కుమార్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. దుకాణాల్లోని స్టాకు, రికార్డ్స్, బిల్లు బుక్కులను పరిశీలించారు. రాష్ట్ర వ్యవసాయాధికారి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ నియమ నిబంధనలకు లోబడి విత్తన దుకాణాలను నడుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు'



రికార్డులను పరిశీలిస్తున్న కమిషనరేట్ అధికారి సురేషన్

చాగలమర్రి, మార్చి 22: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయ అధికారి సురేషన్ హెచ్చరించారు. చాగలమర్రి గ్రామంలోని విత్తన విక్రయ దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. దుకాణాల్లో సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. ఏవో రంగనేతాజీ, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

'స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి'



అహోబిలంలో పోలీసు కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నంద్యాల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని రూరల్ ఎస్ఐ నరసింహులు, బీఎస్ఎఫ్ అసిస్టెంటు కమాండెంట్ వరిందర్ కుమార్ సూచించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో సమస్యాత్మక గ్రామమైన అహోబిలంలో శుక్రవారం పోలీసు కవాతు నిర్వహించారు. గ్రామాల్లో సమస్యలు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'ఓటు హక్కు వజ్రాయుధం లాంటిది'

చాగలమర్రి: యువతీ యువకులకు ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని ప్రిన్సిపాల్ షాబుద్దీన్ అన్నారు. శుక్రవారం చాగలమర్రి వాసవీ ఎయిడేడ్ కళాశాలలో నీ ఓటు నీ బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శివరామిరెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి మహేశ్వరయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



నరసాపురంలో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో

రుద్రవరం, మార్చి 22: గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వద్దని, మెరుగైన వైద్య సేవలు అందించాలి నంద్యాల డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ ఆదేశించారు. మండలంలోని నరసాపురం గ్రామంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష క్యాంపును పర్యవేక్షించారు. వైద్య సిబ్బందికి ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ పూర్తి చేయాలన్నారు. బీసీజీ సర్వే ఇతర సర్వేలను వెంటనే పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ఆదేశించారు. ఆరోగ్య సురక్ష క్యాంపులో తరలివచ్చిన రోగులకు వైద్యసేవలు అందించినట్లు వైద్యాధికారి జయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యాధికారి జ్యోతి బాధ్యతల స్వీకరణ

రుద్రవరం, మార్చి 22: రుద్రవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా ఎం.జ్యోతి బాధ్యతలు చేపట్టినట్లు వైద్యాధికారి శివమోహన్ తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్య అధికారి నవీన్‌కుమార్ కోవెలకుంట్ల కమ్యూనిటీ హెల్త కేంద్రానికి బదిలీ అయినట్లు తెలిపారు. వైద్యాధికారి జ్యోతి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు.

వైభవంగా చండీ హోమం



చండీ హోమం చేస్తున్న వేద పండితులు

చాగలమర్రి, మార్చి 22: చాగలమర్రి గ్రామంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో వేద పండితుడు పెద్దశాస్త్రీ ఆధ్వర్యంలో గణపతి, చండీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి క్షీరాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. మహిళలు సామూహిక ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. వెండి రథోత్సవం నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా నాగప్రతిష్ఠ



నాగప్రతిమల దగ్గర పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ప్యాపిలి, మార్చి 22: పట్టణంలోని ఈశ్వర ఆలయంలో శుక్రవారం నాగ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ పురోహితులు నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

12 మందికి కంటి ఆపరేషన్లు

శిరివెళ్ల, మార్చి 22: నంద్యాల ఆయుష్ యోగా సేవా సమితి, శిరివెళ్ల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17న శిరివెళ్లలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 40 మందికి కంటి శుక్లం లోపం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. వీరిలో మొదటి విడతగా 12 మందికి నంద్యాలలోని శాంతిరాం వైద్యశాలలో ఉచితంగా శుక్లం ఆపరేషన్లు చేయించినట్లు నిర్వాహకులు ఖండె ఆనంద్ గురూజీ, ఖండె శ్యాంసుందర్ లాల్ శుక్రవారం తెలిపారు. సామాజిక సేవలో భాగంగా శిరివెళ్ల, చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు వారు తెలిపారు.

'ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు'



హరినగరం మంచినీటి పథకం వద్ద స్తూపాలకు వేసిన ముసుగును పరిశీలిస్తున్న మాడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అధికారి రామచంద్ర

రుద్రవరం, మార్చి 22 : ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మాడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అధికారి రామచంద్ర హెచ్చరించారు. శుక్రవారం వీడియో కవరేజీ చేస్తూ నరసాపురం, హరినగరం, ముకుందాపురం, చిత్రరేణిపల్లె గ్రామాల్లో పర్యటించామన్నారు. అన్ని స్తూపాలు, శిలాఫలకాలకు ముసుగులు వేసినట్లు గుర్తించామన్నారు. ఆయన వెంట కార్యదర్శులు ఆదిలక్ష్మి, శివకృష్ణ తదితరులు ఉన్నారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఫ్లయింగ్ స్క్వాడ్

ప్యాపిలి, మార్చి 22: పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన పది పరీక్షా కేంద్రాన్ని శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్ పరిశీలించింది. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అధికారి ఫణీంద్ర సిబ్బందికి సూచించారు. పరీక్ష కేంద్రంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రతలు తీసుకోవాలని సూచించారు.

కమ్మవారి పల్లెలో టీడీపీ శంఖారావం

కొలిమిగుండ్ల, మార్చి 22: మండలంలోని కమ్మవారిపల్లె గ్రామంలో టీడీపీ శంఖారావం కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు రామదాసు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఇందులో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన ఎన్నికల మ్యానిఫెస్టో సూపర్ సిక్స్ పథకాల క్యాలెండర్లను ఇంటింటికీ తిరిగి ప్రజలకు పంపిణీ చేశారు. సార్వత్రిక ఎన్నికలలో టీడీపీని గెలుపునకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జి ఆర్ నరసింహ, టీడీపీ నాయకులు వెంకటేశ్వరరావు, ఆదెన్న, భార్గవ్, లక్ష్మీ నారాయణ, వెంకటేష్, కొండల రాయుడు, రామాంజినేయులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

మాజీ మంత్రి భూమా అఖిలప్రియ



గొట్లూరులో అఖిలప్రియ సమక్షంలో టీడీపీ చేరిన వైసీపీ నాయకులు

నంద్యాల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ కోరారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బద్రి సుధాకరరెడ్డి, శ్రీనివాసరెడ్డి(వాసు) రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 40 కుటుంబాల వారు ప్రహ్లాదుడు, హెచ్ఎం సాంబశివుడు, ప్రహ్లాదుడు, మంగలి బాలకృష్ణ టీడీపీలో శుక్రవారం చేరారు. అఖిలప్రియ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. భార్గవ్‌రామ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'అరాచక పాలనకు చరమగీతం పాడాలి'

చాగలమర్రి: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ పిలుపునిచ్చారు. శుక్రవారం చాగలమర్రి గ్రామంలోని వినాయకనగర్‌లో ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. సూపర్-6 పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో అన్సర్‌బాషా, నరసింహారెడ్డి, సల్లానాగరాజు, గుత్తి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

- గొట్లూరు గ్రామంలో వైసీపీ నాయకుడు జమాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణమ్మతో పాటు మరో 10 కుటుంబాలు మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.